కాబట్టి లేనిపోని వాదనల లేవదీసి మనము కాల హరణము చేసేకంటే స్థిరసూత్రాన్వేషణ మేదైనా చేస్తే బాగుంటుంది. వ్యావహారిక భాషలో కవిత్వం (అనగా నా ఉద్దేశ్యం పద్యకావ్యమనే) ఇంతవరకూ రాలేదని. ఒక కవి జాతీయ పదాల నెక్కువగా వాడి ఛందోబద్ధ కవిత్వం చెప్పినంత మాత్రాన దాన్ని వ్యావహారిక భాషా కవిత్వ మనకూడదని నా యభిప్రాయం. సంప్రదాయ మనేది మనలను బ్రతికించుకుంటూ వస్తోంది. కాని మనం సంప్రదాయాల్ని బ్రతకనిచ్చేటట్లుగా లేము. కాబట్టే శ్రీ పాపయ్యశాస్త్రిగారు జాషువా వంటి నవీనుల ఖండకావ్యాలు కూడా తేటతెల్ల ముగా నవీన భావాలతో ఉండినా, శిష్ట వ్యావ హారిక మంటే క్లాసులో చదివే చిన్న విద్యార్థే ప్రశ్నవైచి తీరుతాడు. చిన్నయ సూరి తర్వాత వర్ఘులవారు, దూసివారు, బహుజనపల్లివారువంటి లాక్షణికులు బయలుదేరి ప్రాచీన సంప్రదా యాన్ని పరిపోషించారు. కాని దిక్కులదిరే వాదనల నొనర్చిన గిడుగువారు మాత్రం తెనుగు విద్యార్థి చదువదగిన లాక్షణిక గ్రంథాన్ని సృజించలేదు. వారి యనుయాయులు కూడా డిటో మార్గాన్నే అనుసరించారు. గిడుగువారి ముఖ్యానుచరులలో నొకరైన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు "రాజరాజు" నాటకాన్ని వ్యావ హారిక భాషలో వ్రాశారు. కాని దానిలోని ఉదాత్తత యేమిటో చదివినవారినడిగి గ్రహిం చాలి. డాక్టరు సీతాపతిగారి "భారతీ శతకం" అరణ్యరోదనంగా పరిణమించింది. దాని నవగత మొనర్చుకొన్న ఆంధ్రు లెందరుంటారో వాకబు చేయాలి. వీరియప్రకవీయ విమర్శనముపై శ్రీ వేదుల రామశాస్త్రి గారు ప్రతివిమర్శనను గ్రంథంగా ప్రచురించారు. వీరు కిమస్నాస్తి. వ్యావహారిక భాషలో కూడా వ్యాకరణ విరుద్ధ ప్రయోగా లున్నాయంటూ శ్రీ సీతాపతిగారు "ఐక్యత," "గౌరవనీయ" వంటి శబ్దాల నుదహ రించారు. వానిని పూర్వపు వ్యాకరణముచే నిషే ధించాయి. వాడుకలో తప్పులేదు. శ్రీ సీతాపతి గారు ఇకనైనా వాదప్రచారం విడిచిపెట్టి క్రియా రూపేణ ఒక్క లక్షణ గ్రంథాన్ని సులభశైలిలో ప్రచురిస్తే భావికాలానికి క్షేమంగా ఉంటుంది. లేకపోతే, అభ్యుదయ కవుల వాదంలాగానే వీరి వాదం కూడా అపహాళనను పొందుతుంది. ఆ మధ్యన అభ్యుదయ కవులు గతించిన కవులకు తరగతులు నిర్ణయించారు. ఎలాగంటే, నన్నయ అభ్యుదయ కవియట. తిక్కన కాడట. పోతన అభ్యుదయ కవియట శ్రీనాథుడు కాడట. అలా ఉంటుంది విచిత్రం. వీరినిర్ణయాలు ఏసూత్రంమీద ఉంటాయో ఇతరులు చెప్పలేరు. అలాగే వ్యావ హారిక భాషావాదం కూడాను. కాని సృష్టి రహస్యం ఏమంటే, ఈ వాదాల త్రోవ వాదా లదే. రచనా సృష్టిత్రోవ రచనదే. వద్దన్నా పరిశుద్ధ గ్రాంథిక కవులుంటూనే వున్నారు.

# అంతా దేవుడి దయ

"సఫేరా"

డాక్టర్ ప్రసాదరావు అసలే భయస్థుడు. చిరాకుపడడం మామూలైనా ఇతరులను హింసించుకుని తినే స్వభావంగాదతనిది. దైవ భక్తి గలవాడు. ఆ ఊళ్ళోకి ఆయనే పెద్ద డాక్టరు. ఫీజుకూడా చాలా పెద్దదే. ఆపరే షనులో ఆయన సిద్ధహస్తుడని ప్రతీతి కావడము వల్ల ఎక్కడెక్కడ వారూ ఆయనదగ్గరకు వచ్చి చికిత్స చేయించుకునిపోతూ ఉంటారు.

ఒకరోజున శేషప్పఅనే రైతు ప్రక్కగ్రామం నుంచి రొప్పుతూ రొప్పుతూ డాక్టరుగారి దగ రకు వచ్చాడు. అప్పుడే పది, పన్నెండేళ్ళనుంచి డాక్టరుగారు ఆ గ్రామంలో ప్రాక్టీసు చేస్తున్నా శేషప్పకు ఎన్నడూ ఆయన్ను కలుసుకొనే అవ కాశం కలగలేదు. డాక్టరుగారంటే తాత చిన్న తనంలో తనను పట్నం తీసుకువెళ్ళి మోటార్లు, ట్రాంబండ్లు చూపిస్తున్నప్పుడు చూసిన దొర టోపీ విగ్రహాలలో ఏదో ఒకదానిలాగా ఉంటా డనుకున్నాడు అతడు. డాక్టరుగారి ఆసుపత్రి మేడమీద ఉన్నది. శేషప్ప వీధి గుమ్మంలో కాలుపెట్టగానే సూటు, బూటు, హేటూ,

వేసుకుని తనలో తాను గొణుక్కుంటూ, ఒక ముసలాయన కర్రపటుకుని మెట్లు దిగి రావడం చూశాడు, ఆయన్ని చూడగానే—

"దండాలండీ! డాకటేరు బాబూ! మా పెద్దోడు గుక్కిపెట్టకుండా పడిపొయ్యాడండీ. నోట్నుంచి నురుగుదబ్బిలు పడుతుండాయి. తక్షణం దయచేసి రక్షించాలి" అని శేషప్ప దీనంగా మొరపెట్టుకున్నాడు.

ముసలాయన చాలా సేపు గొణుక్కుని,

"ఇప్పుడు నాకు చాలా అర్జెంటు పని ఉంది. కుర్రాణ్ణి కాళ్ళకు తాడుగట్టి దూలానికి వేలాడదీసి తలక్రిందులుగా ఊగిస్తూ ఉండు, ఇంతలో నేనుకూడా వస్తా"నని ఆయన బయటికి వెళ్ళిపోయాడు. శేషప్ప కంగారుతో తన యింటిసంగతీ తన సంగతీ డాక్టరుగారికి తెలుసునో లేదో అనే మాట ఆలోచించనూలేదు. డాక్టరు ఆవిషయాన్ని గురించి విచారించనూలేదు. "చిత్తంబాబూ!"అని శేషప్ప త్వరత్వరగా ఇటికిపోయి కుర్రాడికాళ్ళకు తాళ్లుపోసి దూలానికి తలక్రిందులుగా వేలాడదీసి ఊగిస్తూ కూర్చున్నాడు. ఇంటెల్లిపాదీ ఇదేమి వైద్యమో బాబూ అని కంగారుపడుతూ ఉన్నారు. పిల్లవాడి నోటినుంచి ధారాపాతంగా నురుగు దబ్బిలుపడుతున్నాయి. గుడ్లు ఇతింతలై పోయినయి. చేతులు వేలాడేసుకుని శవంలాగా వేలాడుతున్నాడు కుర్రాడు. అరగంటైంది. ఇంకా డాక్టరు రాలేదు. శేషప్పకు గాభరాయెత్తి తిరిగి డాక్టరుగారింటికి వెళ్లేడు. వీధిలో ఎవరో పేషంట్లు డాక్టరుగారు మేడమీద ఉన్నారన్నారు. మెట్లెక్కి పైకివెళ్లేడు శేషప్ప. డాక్టరుగారు ఏదో అర్జెంటు కేసును తలుపులు వేసుకుని ఎగ్జామినేషన్ చేస్తున్నారు.

"డాకటేరుగారండోయ్! పిల్లోడు గుటుగుటమంటున్నాడండోయ్! వేగిరం దయచెయ్యండి!" అని తలుపులు దబదబ గుద్ది హంగామాచేశాడు శేషప్ప.

"ఎవడురా! ఆ స్టుపిడ్? బయటికీడ్చెయ్యండి వాణ్ణి! అల్లరిచేస్తాడేం అల్లాగా" అని డాక్టరుగారు కసురుకుంటున్న మాటలుమాత్రం తాళపుచెవి కన్నంలోనుంచి ఘాటుగా బయటికి దూకినయి. వాటి వెనకాలే కాంపౌండరు తలుపు తెరుచుకుని వచ్చేడు.

"ఏం కష్టంవచ్చింది? ఎవరు కావాలి నీకు? గాభరాపడకు"అంటున్నాడు శేషప్పతో. అతడు మద్యలోనే అందుకొని,

"అదేమిటయ్యోయ్ అలాగంటున్నావ్! అరగంటకు ముందు డాకటేరుగారు మెట్లుదిగొస్తూ, కుర్రాణ్ణి దూలానికివేలదియ్యమనీ, యెనకాల్నించి వస్తున్నామనీ చెప్పినారు, ఏమెరగనట్లు ఇప్పుడిలా మాట్లాడుతావేం! కుర్రాణ్ణి వేలదీసినా! గుడ్లు మిటకరించుకొని నురుగులు కక్కుతూ శవమైయున్నాడు పిల్లోడు. అరగంటైంది. ఇంకా డాకటేరు రానేమర్రా అని పరుగెత్తుకునొచ్చేను" అన్నాడు కళ్లు పెద్దవిచేసి.

"ఏం కుర్రాడు? ఎక్కడి డాక్టరు? దూలానికి వేలదియ్యడమేమిటి? ఎవరు చెప్పేరు నీకు వేలదియ్యమని? ఎన్నాళ్ళనుంచి బాధపడుతున్నాడు? వయసెంత?"

"ఏమయ్యోయ్! యీ పుర్రాండం చెప్పిందాకా నాకు తీరికనేదు, డాకటేరునిలారమ్మను" అని బింకంగా చెప్పి రొండిని రెండు చేతులూ మోపి నిగిడి నిలవబడ్డాడు. ఇంతట్లోపల పరీక్ష ముగించుకుని ప్రసాదరావు గూడా బయటికి వచ్చాడు.

"అరుగో! డాక్టరుగారు రానేవచ్చారు! ఏంగావాలో చెప్పుకో!" అన్నాడు కాంపౌండరు.

"ఛస్! యీనేం డాకటేరు! పంచె గట్టుకుంటాడా డాకటేరు? ఇందాకటి దొరనాగా, టోపీ పెట్టుకోని, కంటిద్దాలు పెట్టుకోని, కర్రపట్టుకోని, మూతెగరేసుకుంటూ పోయిన డాకటేరు ఏడుండాడు? నా కుర్రాడిని తల్లక్రిందులుగా వేలాడదీయమని చెప్పిన డాకటేరు ఏడుండాడంటూ"అని శేషప్ప అంకెలు వేశాడు.

ప్రసాదరావుకు అంతా అర్థమైంది. "మే అండ్ బేకర్"కంపెనీ ఏజంటుగా పని చేస్తూ, యీ మధ్యనే మతిస్థిమితము తప్పి, తనదగ్గర కొచ్చి చికిత్స పొందుతూ ఉన్న పిచ్చి మామగారు ఈ భాగవతానికంతా కారణమని తెలుసుకున్నారు. కాంపౌండరును చూచి—

"ఏమోయ్! ఇలా చూడు! చాలా ప్రమాదమే జరిగింది! వెంటనే గుర్రపుబండిని తెప్పించు" మని పురమాయించి శేషప్ప వంక తిరిగి,

"ఓయ్! ఆసామీ నడుస్తుండు, వస్తున్నా. అన్నట్లు మీ యిల్లెక్కడ?"అని అడిగాడు.

"ఏమయ్యోయ్! పల్లెటూరోళ్ళనుచేసి దగాచేస్తే ఊరుకోడానికి చెవులుదెగిన యదవననుకున్నావు కాబోలు! శేషప్పంటే చుట్టుపట్ల గ్రామాలన్నింటికీ పక్కలో బల్లెమని తెలుసు! నీయేశాలు నా ముందర చూపెట్టకు! ఆ డాకటేరు యేడంటా? పిల్లోడు చస్తుంటే బయటికి రాడేం ఆడముండ నాగా?"అని శేషప్ప గందరగోళం చేయసాగేడు.

"ఇదిదో! శేషప్పా విను. ఇందాక నీకు కనిపించిన ఆయన డాక్టరుగాడు. ఆయన నా పిచ్చి మామగారు. ఆయన మాటలువిని నీవు ఏమేమో చేశావు. నేనే నిజమైన డాక్టరును. వస్తున్నాను వెంటనే. బండి రాగానే ఇద్దరమూ కలిసి మీ యింటికి వెళ్దాము నాడు"అని ప్రసాదరావు శేషప్పకు నచ్చచెప్ప చూశాడు.

"ఏమయ్యోయ్! అదంతా నాకు దెలీదు. అంత ఎన్నముద్ద లాగా బెంచుకుంటున్న కుర్రోడికి నీ యింటి మనిసిమూలంగా ఇంత కట్టమొచ్చింది. అస్తి జన్నందార బోసినా కుర్రోణ్ణి నాకిస్తివా సరేసరి! నేకుంటేనా? ఇదే చూడు! అద్దమ రేతిరికాడ బడితె దీసుకుని, నా జీవానికి బదులీగా నీ యింటో జీవాన్ని నా గెయ్యకపోతే నా పేరు శేసప్ప కాదు" అంటూ నిప్పులు గక్కేడు శేషప్ప.

డాక్టరు ప్రసాదరావు కొయ్యోపోయి ఏమీ తోచక గుఱ్ఱపుబండి యెక్కి శేషప్ప యింటికి సరంజామా అంతా దీసుకుని బయలుదేరేడు. ఆయన మనసులో మనసు లేదు. శేషప్ప మూర్ఖుడు. అతన్ని గురించి చాలాసార్లు విని ఉన్నాడు ఇదివరలో. పరిస్థితులు తప్పివస్తే అన్నంతపనీ చేసితీరుతాడు కూడాను. మోట పసరం! తీరా జరిగేది జరిగిన తరువాత ఏమనుకుంటే ఏమున్నది! ఏమి చేయనురా, భగవంతుడా అని ప్రసాదరావు కంగారుతోటే తానేమి చూడబోతానో అనుకుంటూ శేషప్ప యింటి ముందర బండి దిగేడు.

గుమ్మంతో ఆయనఅడుగుపెట్టగానే పంచలో తల్లక్రిందులుగా వ్రేలాడుతున్న కుర్రాడు. "ఆచ్ఛి" అని ఒక పెద్ద తుమ్ము తుమ్మేడు. నురుగులు పడుతున్న అతని నోటిలోనుంచి నిమ్మకాయంత లావు గుండు సబ్బుబిళ్ళ తుళ్ళి బయటపడ్డది. బిడ్డ వెంటనే గుక్కపట్టి ఏడవడమారంభించేడు.

* * *

జరిగిన సంగతిది ఆరోజున శేరి సెట్టి దుకాణంలో పిల్లలకని బెల్లపుండలు తెప్పించింది శేషప్ప భార్య. ఎలా వచ్చిందో వాటితో కలిసి సెట్టిగారి గ్రామపరిశ్రమల బాపతు నాటుసోపు ఉండ కూడా వచ్చింది. దాన్నికూడా బెల్లపుండ అనుకుని కుర్రాడు నోట్లో పెట్టుకొని మింగేశాడు. అది కాస్తా గొంతునబడి క్రిందికిపోక పైకిరాక పిల్లవాణ్ణి అట్టెట్టుచేసింది. గంటసేపు తలక్రిందులుగా వేలాడడంతో ముక్కుల్లోకికూడా నీళ్ళుపోయి, తుమ్ము వచ్చింది. దానితో గొంతుకు అడ్డుపడిఉన్న సబ్బుఉండ పట్టువదలి తుళ్ళి బయటికిపడ్డది. బిడ్డ తెప్పరిల్లి బ్రదికి బయటపడ్డాడు. ప్రసాదరావుగారు ఆటే శ్రమపడే నవసరం లేకపోయింది.

దండాలు, దసకాలు పెట్టి, సాయంకాలం నాలుగు పెద్దపనసకాయలూ, ఐదు అరటిగెలలూ, రెండు మానికెల కమ్మటి నేయీ, డాక్టరుగారికి నజరానాగా పంపేడు శేషప్ప.

మరునాడే డాకరుగారి అబ్బాయి పుట్టిన రోజు పండుగ. శేషప్పనుగూడా డాక్టరుగారు అందరితోబాటు విందుకు పిలిచారు. శేరిశెట్టి కూడా ఆ శుభమహోత్సవానికిహాజరై అందాన్ని అతిశయింప జేశాడు. అందరూ భోజనాల అనంతరం కూర్చుని మాటామంతీ అడుకుంటున్నారు.

తన పిల్లవాడ్ని చూస్తూ శేషప్ప,

"దేవుడి దయ" అన్నాడు.

తన పిల్లవాడినీ శేషప్పనూ చూస్తూ

"దేవునిదయ"అని కళ్లు మూశారు డాక్టరుగారు.

"దేవునిదయ"అన్నాడు శేరిశెట్టి మొలలో తాళాలు సవరించుకుంటూ.

"దేవుని దయ హి...హి...హి...హి..." అన్నాడు వికటంగా నవ్వుతూ డాక్టరుగారి పిచ్చి మామగారు.